# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 104 క్రిష్ణా, శుక్రవారం 09 - 01 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## యుద్ధప్రాతిపథకం గా త్రాగునీరుటి పనులు



**ఏలూరు జిల్లా పెదపాలపర్రు::::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి::::** యుద్ధప్రాతిపథకం గా త్రాగునీరుటి పనులు పెదపాలపర్రు గ్రామంలో జాతీయ రహదారి మార్గ విస్తరణ పనులలో భాగంగా నూతన రహదారిని నిర్మాణం లో భాగంగా గ్రామంలోని పంచాయితీ అధీనంలో వున్న వాటర్ ట్యాంక్ ద్వారా త్రాగునీరుని గ్రామంలోని ప్రజలకు సరఫరా చేసే ప్రధాన పైపు పగిలి పోవుట చేత ప్రజలకు త్రాగునీటి సమస్య రాకూడదని ముదినేపల్లి మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి ఆదేశాలను అనసరించి గ్రామ సర్పంచ్ గంటా రాకేష్ కుమార్ పర్యవేక్షణలొ త్వరితగతిన ప్రజలకు త్రాగునీటిని అందించటానికి నూతన త్రాగునీటి పైపులని వేయిస్తున్నామని,రహదారి నిర్మాణ కాంట్రాక్టర్,వారి యంత్ర పరికరాలు ద్వారా తవ్వించుట చే ప్రజలకు నీటి సమస్య వచ్చిందని, కాంట్రాక్టర్ వారి సిబ్బంది నష్టం చేశారని, నీటి పైపులకు అగు ఖర్చు,కూలీల ఖర్చు రహదారి విస్తరణ అధికారులుకి తెలియచేసినా కూడా స్పందించనందున ముదినేపల్లి తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి దృష్టికి ఈ విషయం చేరగానే ముందు ప్రజలకి త్రాగునిటిని అందించాలని పంచాయతీ ద్వారా యుద్ధాప్రాతిపథికన నూతన పైపులని వేస్తున్నామని ఈరోజు రాత్రికి ప్రజలకు త్రాగు మంచినీటిని అందిస్తామన్నారు గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం చేస్తున్న శోభనాద్రి చౌదరి కి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## మహిళల ఆర్థిక ప్రగతి కోసం తాను తెచ్చిన డ్వాక్రా వ్యవస్థ దేశానికే ఆదర్శమన్న సీఎం



**అమరావతి, జనవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడాలనే సదుద్దేశంతో 30 ఏళ్ల క్రితం తాను ప్రారంభించిన డ్వాక్రా వ్యవస్థ, నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలు సాధించిన ఆర్థిక స్వావలంబన చూస్తుంటే తనకు ఎంతో గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. గురువారం గుంటూరులో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సరస్ మేళా 2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను చూస్తే నా గుండె గర్వంతో ఉప్పొంగుతుంది. 30 ఏళ్ల క్రితం మహిళలు సమావేశాల కోసం బయటకు వస్తే ఎగతాళి చేసిన వారే, ఇప్పుడు వారి ప్రగతిని చూసి అభినందిస్తున్నారు. ఈ రోజు డ్వాక్రా సంఘాలు తిరుగులేని వ్యవస్థగా రికార్డు సృష్టించాయి. రాష్ట్రంలో కోటీ 13 లక్షల మంది డ్వాక్రా మహిళలు రూ. 26 వేల కోట్ల నిధిని, రూ. 5,200 కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవడం వారి పట్టుదలకు నిదర్శనం. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ. 46,590 కోట్ల బ్యాంకు రుణాలు పొందారంటే వారి ఆర్థిక క్రమశిక్షణ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు అని వివరించారు. ఈ ప్రదర్శన మినీ ఇండియాను తలపిస్తోందని, పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. దేశ రాజధానిలో జరిగే ఇలాంటి కార్యక్రమాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను చంద్రబాబు అభినందించారు.తెలుగుదేశం పార్టీకి ఆడబిడ్డలతో ఉన్నది ప్రత్యేక అనుబంధమని చంద్రబాబు గుర్తుచేశారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఆనాడే మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని, వారి ఉన్నత విద్య కోసం తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించానన్నారు. రాష్ట్రంలో 89 లక్షల మంది డ్వాక్రా, 24 లక్షల మంది మెప్మా సంఘాల సభ్యులున్నారని తెలిపారు.తాను ఇచ్చిన ఐటీ పిలుపుతో ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, ఇప్పుడు ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే 93 వేల మంది సూక్ష్మ, చిన్న తరహా పారిశ్రామికవేత్తలుగా మారారని, డ్వాక్రా మహిళలు విదేశాలకు వెళ్లి శిక్షణ ఇచ్చే స్థాయికి ఎదిగారని కొనియాడారు.ముఖ్యమంత్రి అంటే పెత్తందారు కాదని, ప్రజలకు సేవ చేసే సేవకుడని చంద్రబాబు అన్నారు. తమ కూటమి ప్రభుత్వం సంక్షమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పనిచేస్తోందని తెలిపారు. 'తల్లికి వందనం' కింద ఏటా రూ. 10,090 కోట్లను 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని, 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. 'దీపం' పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామన్నారు. 'సంజీవని' కార్యక్రమంతో రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తామని, పేదరికం లేని సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో భాగంగా, స్త్రీ నిధి పథకం కింద డ్వాక్రా సంఘాలకు రూ. 1,375 కోట్ల చెక్కును, సెర్ప్ ద్వారా మరో రూ. 2,171 కోట్ల రుణాలను సీఎం పంపిణీ చేశారు. చేనేత వస్త్రాల స్టాల్స్‌ను సందర్శించిన ఆయన, తన అర్ధాంగి భువనేశ్వరి కోసం ఒక చీరను కొనుగోలు చేశారు. తన భర్త అనారోగ్యంతో బాధపడుతున్నాడని ఓ మహిళ విన్నవించుకోగా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి తక్షణమే రూ. 6 లక్షలు మంజూరు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

## ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ సీనియర్ మెన్ జట్టు కెప్టెన్ గా హనీత్



**విజయవాడ, జనవరి 08 ( క్రైం కౌంటర్ న్యూస్ )** విజయవాడ కు చెందిన పొన్నాడ హనీత్ నాగ్ ఆంధ్రప్రదేశ్ సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ జట్టు కెప్టెన్ గా ఎంపికైనట్లు షూటింగ్ బాల్ శిక్షకులు, అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు విజయ్ కుమార్ గోగులమూడి తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహారాష్ట్రలో జరగబోయే 44వ జాతీయస్థాయి సీనియర్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టు కి ఎంపికైనట్లు తెలిపారు. గత డిసెంబరు నెల 25 , 26 నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో జరిగిన 8వ రాష్ట్రస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలలో ఎన్.టి.ఆర్ జట్టు తరపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరచి జట్టు విజేత గా నిలవడానికి కీలకపాత్ర పోషించాడని అన్నారు. పోటీల వ్యక్తిగత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర జట్టు కెప్టెన్ గా వ్యవహరించడం పట్ల జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాలిన్ , కార్యదర్శి శివ కృష్ణా పోకతోట, కోశాధికారి నసీమ, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలియజేశారు.

## తిరుమల రథసప్తమి అలర్ట్: 25న ప్రత్యేక వేడుకలు



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08,** తిరుమలలో ఈ నెల 25న రథసప్తమి వేడుకలు జరగనున్న నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయాలు తీసుకుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి సమీక్ష సమావేశంలో సూచించారు.ఈ నేపథ్యంలో కొన్ని సేవలు మరియు ప్రత్యేక దర్శనాలు రద్దు చేయబడ్డాయి. ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు, కల్యాణోత్సవం, ఊంజల్ సేవలు రద్దు చేయబడ్డాయి. అలాగే ఎన్ఆర్ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, వికలాంగుల కోసం ఉన్న ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేయడం జరిగింది. 24 నుంచి 26 వరకు తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీ రద్దు చేయబడినట్టు, ప్రొటోకాల్ వీఐపీలకు మినహా సిఫార్సు వీఐపీ బ్రేక్ దర్శనాలు కూడా రద్దు చేశారు.రథసప్తమి రోజు వాహన సేవలు ప్రత్యేకంగా నిర్వహించబడతాయి. ఉదయం 5:30 నుంచి 8:00 వరకు సూర్యప్రభ వాహనం, 9:00 నుంచి 10:00 వరకు చిన్నశేష వాహనం, 11:00 నుంచి మధ్యాహ్నం 12:00 వరకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1:00 నుంచి 2:00 వరకు హనుమంత వాహనం, 2:00 నుంచి 3:00 వరకు చక్రస్నానం, 4:00 నుంచి 5:00 వరకు కల్పవృక్ష వాహనం, 6:00 నుంచి 7:00 వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8:00 నుంచి 9:00 వరకు చంద్రప్రభ వాహనం సేవలు ఉంటాయి.టీటీడీ భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఏర్పాట్లు చేసినప్పటికీ, కొన్నింటి రద్దులు మరియు నియంత్రణల విషయంలో భక్తులు ముందుగానే జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

## ఆన్‌లైన్‌లోనే పొదుపు సంఘాలకు రుణాలు: సీఎం చంద్రబాబు



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08,** పొదుపు సంఘాలు ఇకపై ఆన్‌లైన్‌లోనే రుణాలు పొందే సదుపాయం కల్పిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. గుంటూరు శివారులో జరిగిన సరస్ మేళాలో ఆయన మాట్లాడుతూ.. పొదుపు సంఘాల్లో 1.13 కోట్ల మంది సభ్యులు ఉండగా, రూ. 26 వేల కోట్ల నిధి, రూ. 5,200 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటయ్యిందన్నారు. మహిళా సంఘాల శక్తి తనకు తెలుసని, దేశంలోని ఉత్తమ విధానాలను రాష్ట్రానికి తీసుకొస్తామని చెప్పారు. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే అవకాశం కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు.

## జాతీయ పత్రిక 'ది వీక్ణ తాజా కవర్ పేజీపై మంత్రి నారా లోకేశ్

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08,** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాలన దక్షత, దార్శనికత జాతీయ స్థాయిలో విస్తృత గుర్తింపు పొందుతున్నాయి. ప్రతిష్ఠాత్మక జాతీయ పత్రిక 'ది వీక్ణ తమ కొత్త సంచికలో లోకేశ్ ఫొటోను కవర్ పేజీపై ప్రచురించి, 'ఏపీకి చీఫ్ జాబ్ క్రియేటర్ణ అని అభివర్ణించింది. దీనిపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. లోకేశ్ పాలనా శైలిపై, ఆయన లక్ష్యాలపై ప్రశంసల వర్షం కురిపించారు. లోకేశ్పరిపాలనలో వేగం, ఆవిష్కరణలు, జవాబుదారీతనాన్ని తీసుకొస్తున్నారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ణ అనేది కేవలం నినాదం కాదని, అది ప్రజలకు, అవకాశాలకు ప్రభుత్వం ఇస్తున్న బలమైన నిబద్ధత అని" ఆమె స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి అనుభవం, స్పష్టమైన సంస్కరణల దృక్పథంతో లోకేశ్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఉద్యోగాలు, నైపుణ్యాలు, పెట్టుబడిదారుల విశ్వాసంపై లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారని, ఇది ఆర్థిక వృద్ధిని ప్రజల ఉపాధిగా మార్చాలనే ఆయన బలమైన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమలకు అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా మారుస్తున్నారని కొనియాడారు. పారిశ్రామిక వర్గాలు ప్రభుత్వంపై నమ్మకం ఉంచడం, రాష్ట్రం సరైన దిశలో పయనిస్తోందన్న విశ్వాసాన్ని బలపరుస్తోందని ఆమె పేర్కొన్నారు.కాగా, 'ది వీక్ణ మ్యాగజైన్ కూడా లోకేశ్ గురించి పలు ఆసక్తికర విషయాలను తన కవర్ పేజీపై హైలైట్ చేసింది. కేవలం మాటలు చెప్పడమే కాకుండా, చేతలతో వేగం చూపిస్తూ పెట్టుబడులను ఆకర్షించడమే లోకేశ్ లక్ష్యమని పేర్కొంది. స్టాన్‌ఫోర్డ్, కార్నెగీ మెలన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలో ఆయన పొందిన ఉన్నత విద్య, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఊతమిస్తోందని తెలిపింది. "నేను కేవలం మంత్రిని కాదు, రాష్ట్ర యువతకు ఉపాధి కల్పించే 'చీఫ్ జాబ్ క్రియేటర్ణగా గుర్తింపు పొందాలనుకుంటున్నాను" అన్న ఆయన ఆశయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. తండ్రి చంద్రబాబు హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చిన స్ఫూర్తితో, లోకేశ్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను ఒక పారిశ్రామిక శక్తి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని 'ది వీక్ణ విశ్లేషించింది.



# అభివృద్ధియే మన ఆయుధం.. విమర్శలకు చేతలతో సమాధానం ఇద్దాం.



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హుందాతనాన్ని కాపాడుకుంటూనే, ప్రత్యర్థుల అసత్య ప్రచారాలను ధీటుగా ఎదుర్కోవాలని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంత్రులతో నిర్వహించిన అల్పాహార విందులో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా దౌర్జన్యాలకు దిగడం లేదా రౌడీయిజం చేయడం తెలుగుదేశం పార్టీ సంస్కృతి కాదని గుర్తుచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను, తప్పుడు ప్రచారాలను ప్రజలకు వాస్తవాలు వివరించడం ద్వారా సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

రాజకీయాల్లో అధికారం అనేది ప్రజలకు సేవ చేయడానికి ఇచ్చిన అవకాశమని, దానిని బాధ్యతగా భావించాలని లోకేశ్ సూచించారు. "రప్పా రప్పా" వంటి అరాచక విధానాలు తమ పార్టీకి ఉండవని, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల మన్ననలు పొందడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన కోరారు. ప్రజా తీర్పును గౌరవిస్తూ, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ప్రస్తుతం మన ముందున్న ఏకైక అజెండా అని ఆయన స్పష్టం చేశారు. పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, ముఖ్యంగా ప్రజావేదిక ద్వారా అందుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులను లోకేశ్ కోరారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో వస్తారని, వారి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో మంత్రులు చొరవ చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని, తద్వారా ప్రభుత్వ పనితీరుపై సామాన్యుల్లో నమ్మకం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో సమస్యల గుర్తింపునకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా వివరించారు. రాబోయే రోజుల్లో ప్రతిపక్షాల నుండి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి మంత్రులందరూ సమన్వయంతో పని చేయాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. భౌతిక దాడులు లేదా బెదిరింపులకు తావులేకుండా, అభివృద్ధి మరియు సుపరిపాలనతోనే ప్రత్యర్థులకు గట్టి సమాధానం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఎంత మేలు చేశామనే అంశమే రాబోయే కాలంలో పార్టీకి శ్రీరామరక్ష అవుతుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ భేటీ ద్వారా మంత్రుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ, బాధ్యతాయుతమైన పాలన వైపు అడుగులు వేయాలని ఆయన కోరారు.

# 'ద్రోహి' ఎవరు? రాయలసీమ ఎత్తిపోతలపై వైసీపీ రచ్చ

**నిజాలు వదిలి నిస్సిగ్గుగా అబద్ధాలు**
**ఆది, అంతం జగన్ హయాంలోనే**
**2020లో మొదలు.. 2021 జూలై 7న ఎన్జీటీ స్టే**
**ఆపై మూడేళ్లు అధికారంలో ఉన్నా మొద్దునిద్రే**
**స్టే వెకేట్ చేయించడంలో జగన్ విఫలం**
**ముందే 'ముచ్చుమర్రి'కి చంద్రబాబు శ్రీకారం**
**అక్కడి నుంచి వరదజలాలు ఎత్తిపోసేలా పథకం**
**అది కొనసాగిస్తే క్రెడిట్ దక్కదన్న జగన్ దుగ్ధ**
**ప్రాజెక్టు పేరు, డిజైన్, హెడ్‌వర్క్ పాయింట్ మార్పు**
**తెలంగాణ ఫిర్యాదుతో అసలుకే మోసం**



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08, 'నేను ముక్కలుగా నరికి... కూకటి వేళ్లతో సహా పెకలించిన చెట్టును నువ్వెందుకు మళ్లీ బతికించలేదు? నువ్వు ద్రోహివి!' 'రాయలసీమ ఎత్తిపోతల పథకం'పై వైసీపీ అధ్యక్షుడు జగన్ వైఖరి అచ్చం ఇలాగే ఉంది. ఆ పథకానికి ఆది, అంతం జగన్ హయాంలోనే జరిగిపోయాయి. అయినా సరే... చంద్రబాబుపై నెపం వేయడం వైసీపీకే చెల్లింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన కోణంలో చేసిన వ్యూహాత్మక ప్రకటన ఆధారంగా జగన్ రోత మీడియా రచ్చ చేస్తోంది. కాస్త వెనక్కి వెళ్లి వాస్తవాలను పరిశీలిస్తే.. 'సీమ'కు అసలు ద్రోహం చేసింది జగనే అని స్పష్టమవుతుంది. ఎలాగంటే... రాయలసీమ జీవనాడి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం.

జలాశయం ఎగువన 790-800 అడుగుల్లో కృష్ణా జలాలు ఎత్తిపోసి సాగు, తాగునీరు అందించాలనే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు చేపట్టారు. రాష్ట్ర విభజన తరువాత సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ముచ్చుమర్రి పూర్తి చేశారు. 2017 ఆగస్టు 8న జాతికి అంకితం చేశారు. ఇక్కడి నుంచి తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు-నగరి కాలువకు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసేలా ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేయాలని ఆనాటి ఇంజనీర్లను ఆదేశించారు. అప్పటి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ నారాయణరెడ్డి (జగన్ ప్రభుత్వంలో ఈఎన్సీగా పని చేసి రిటైర్డ్ అయ్యారు) సూచనలతో సాగునీటి అధికారులు ఏడాదికిపైగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేసి.. వరద సమయంలో రోజుకు మూడు టీఎంసీలు చొప్పున ఎత్తిపోసి బనకచర్ల ఎగువన ఎస్ఆర్ఎంసీలో పోసి, అక్కడి నుంచి తెలుగుగంగ, ఎస్సార్బీసీ, కేసీ కాలువలతో పాటు కుందూ నదిలో మళ్లించేలా ముచ్చుమర్రి-బనకచర్ల లిఫ్ట్‌కు డిజైన్ చేశారు. దాదాపు రూ.3,600 కోట్లు అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను 2018 ఆఖరులో ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అదే సమయంలో సాధారణ ఎన్నికలు రావడంతో ఈ ప్రాజెక్టుకు కదలిక రాలేదు.

జగన్ వచ్చాక జాదూ...: అప్పటికే ముచ్చుమర్రి లిఫ్ట్ పథకాన్ని జాతికి అంకితం చేయడంతో... అక్కడి నుంచే మరో లిఫ్ట్ చేపడితే న్యాయ చిక్కులు, పర్యావరణ అనుమతుల వంటి సమస్యలు తలెత్తేవి కావు. దాదాపు 13-14 కిలోమీటర్లు లింక్ చానల్ కెనాల్ తవ్వకానికి భూ సేకరణ మాత్రం చేయాల్సి వచ్చేది. కానీ... జగన్ హయాంలో అంతా తలకిందులైంది. వైసీపీ ప్రభుత్వంలో ఈఎన్సీగా కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ నారాయణరెడ్డి బాధ్యతలు చేపట్టారు. టీడీపీ ప్రభుత్వంలో, తన ఆధ్వర్యంలోనే రూపొందించిన ముచ్చుమర్రి -బనకచర్ల లిఫ్ట్ ప్రతిపాదనను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును యథవిధిగా చేపడితే చంద్రబాబుకు మంచి పేరు వస్తుందనే కుట్రతో నాటి జగన్ ప్రభుత్వం ముచ్చుమర్రి దిగువన సంగమేశ్వరానికి హెడ్ వర్క్ పాయింట్‌ను మార్చేసి 'రాయలసీమ లిఫ్ట్'గా మార్చేసింది. సంగమేశ్వరం నుంచి రోజుకు మూడు టీఎంసీలు ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన ఎస్ఆర్ఎంసీలో పోసేలా డిజైన్ మార్పు చేశారు. ఇది తామే చేపడుతున్న కొత్త ప్రాజెక్టుగా, తమ ఘనతగా ప్రచారం చేసుకున్నారు. అయితే... ఈ ప్రాజెక్టును ఆపాలంటూ తెలంగాణకు చెందిన శ్రీనివాస్ ఎన్జీటీలో ఫిర్యాదు చేశారు. జస్టిస్ రామకృష్ణన్ నేతృత్వంలోని బెంచ్ విచారణ చేసింది. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలంటూ ముగ్గురు సభ్యుల కమిటీని నియమించింది.

రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం రూ.3,825 కోట్ల అంచనాతో 2020 మే 5న నాటి జగన్ ప్రభుత్వం పరిపాలనా అనుమతులిచ్చింది. దీనికి పర్యావరణ అనుమతులు లేవు. అదే ఏడాది ఆగస్టు 15న టెండర్లు పిలిచింది. ఎస్పీఎన్ఎల్-ఎన్సీసీ-ఎంఈఐఎల్ (మేఘా) జాయింట్ వెంచర్ (జేవీ)గా ఈ పనులు దక్కించుకుని 2021 ఫిబ్రవరి 27న పనులు ప్రారంభించారు. 24 శాతం పనులు చేసి దాదాపు రూ.923 కోట్లు ఖర్చు చేశారు. ఎన్జీటీ ఆదేశాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ పనులు చేపట్టిందని అప్పటి తెలంగాణ ప్రభుత్వం ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్లింది. డీపీఆర్ తయారీ ముసుగులో క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు కూడా కొనసాగించవద్దని 2021 ఆగస్టు 7న ఎన్జీటీ ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ఆ రోజు నుంచి పనులు ఆపేశారని ఇంజనీర్లే చెబుతున్నారు. అయితే, తాగునీటి అవసరాల కోసమంటూ మళ్లీ పనులు మొదలు పెట్టగా.. తెలంగాణ ఎన్జీటీలో కంటెంప్ట్ వేయడంతో అదే ఏడాది పూర్తిగా పనులు ఆపేశామని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ముందస్తు అనుమతులు లేకుండా ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టి పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించడంతో సీపీసీబీ/ఏపీపీసీబీకి రూ.2.65 కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని 2024 మార్చి 22న ఎన్జీటీ ఆదేశించింది. ఇవన్నీ జగన్ హయాంలోనే జరిగాయి. అంటే... 'ముచ్చుమర్రి-బనకచర్ల' వల్ల జరగాల్సిన మేలును చెడగొట్టింది జగన్! 'రాయలసీమ లిఫ్టు' ఆగిపోయిందీ ఆయన హయాంలోనే! మరి... సీమ ద్రోహి ఎవరు?

ఎవరు చెప్పింది నిజం...

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యూహాత్మక ప్రకటనతో వైసీపీ రచ్చ చేయడం మొదలుపెట్టింది. చంద్రబాబుపై తానే ఒత్తిడి తెచ్చి రాయలసీమ లిఫ్టు ఆపివేయించానన్న రేవంత్ మాట ల్లో నిజం లేదన్నది నిజం! బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ప్రకటనతో ఇది స్పష్టమైంది. 'ఎన్జీటీని ఆశ్రయించి మా హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతలను ఆపివేయించాం' అని చెప్పారు. అంటే... జగన్ హయాంలోనే అది ఆగిపోయిందని తేల్చేశారు. ఇక.. సీమ లిఫ్టును ఆపింది ఎన్జీటీయే అని జలశక్తిశాఖ మాజీ సలహాదారు శ్రీరామ్ కూడా స్పష్టం చేశారు.

# ప్రసార భారతిలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు..

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08, దేశీయ అతిపెద్ద పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టర్ 'ప్రసార భారతి' నిరుద్యోగులకు మంచి అవకాశాన్ని కల్పించింది. సంస్థలోని మార్కెటింగ్ విభాగాన్ని బలోపేతం చేసే దిశగా మొత్తం 14 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రభుత్వ రంగ సంస్థలో కెరీర్ ప్రారంభించాలనుకునే యువతకు ఇది ఒక అద్భుతమైన వేదికగా నిలవనుంది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఎంబీఏ (వీడీూ) లేదా మార్కెటింగ్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. విద్యార్హతతో పాటు సంబంధిత విభాగంలో పని అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. అభ్యర్థుల వయస్సు 35 ఏళ్లకు మించకూడదని నిబంధన విధించారు. నిర్ణీత విద్యార్హతలు కలిగి, ఉత్సాహంగా పనిచేసే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఎంపిక ప్రక్రియ విషయానికి వస్తే, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను తొలుత వారి విద్యార్హతలు మరియు అనుభవం ఆధారంగా షార్ట్ లిస్ట్ చేస్తారు. ఆ తర్వాత ఎంపికైన వారికి ఇంటర్వ్యూ నిర్వహించి తుది జాబితాను ప్రకటిస్తారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు చెన్నై, హైదరాబాద్, ముంబై, కోల్‌కతా వంటి మెట్రో నగరాల్లో పని చేయాల్సి ఉంటుంది. అక్కడ పనిచేసే వారికి నెలకు రూ. 35,000 నుండి రూ. 50,000 వరకు వేతనం అందుతుంది. ఇతర నగరాల్లో నియమితులైన వారికి నెలకు రూ. 35,000 నుండి రూ. 42,000 వరకు జీతం చెల్లిస్తారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జనవరి 21వ తేదీలోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరు. పూర్తి వివరాల కోసం మరియు ఆన్‌లైన్ అప్లికేషన్ కొరకు ప్రసార భారతి అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించవచ్చు. నోటిఫికేషన్‌కు సంబంధించిన ఇతర షరతులు మరియు నిబంధనలను వెబ్‌సైట్‌లో క్షుణ్ణంగా చదివి దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం.

# ఉత్తమ ప్రతిభ కనపరిచి విజేతలుగా తిరిగిరావాలి : విజయ్ గోగులమూడి



విజయవాడ స్పోర్ట్స్ , జనవరి 08 (క్రైం కౌంటర్ న్యూస్ ) మహారాష్ట్రలోని సోలాపూర్‌లో జనవరి నెల 8 నుంచి 10 వరకు జరగనున్న సీనియర్ జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు కృష్ణా జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి పొన్నాడ హనీత్ నాగ్, పెరుగు శరన్ హేమంత్, సురేఖ ఊసల నెల్లూరు జిల్లా కావాలిపట్టణంలో డిసెంబర్25, 26 తేదీలలోజరిగిన 8వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గోగులముడి తెలిపారు. విజయవాడ నుంచి బయలుదేరిన క్రీడాకారులను విజయ్ అభినందించి జాతీయ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి విజేతలుగా తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో పలువురు సీనియర్ క్రీడాకారులు పోకతోట సుమలత, గోగులమూడి సాయి, జె పుష్పక్ పాల్గొన్నారు.

# గుంటూరు శివార్లలో సరస్ - డ్వాక్రా బజార్ ను సందర్శించిన చంద్రబాబు



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08, గుంటూరు నగర శివార్లలో నిర్వహిస్తున్న 'సరస్ ఎగ్జిబిషన్ – అఖిల భారత డ్వాక్రా బజార్ణ ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ఈరోజు అక్కడకు వెళ్లిన ముఖ్యమంత్రి ప్రదర్శనలో భాగంగా డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక స్టాల్లో ఏర్పాటు చేసిన మాడుగుల హల్వాను చంద్రబాబు రుచి చూశారు. టేస్ట్ చాలా బాగుందని ప్రశంసించారు. దీంతో, ఆ స్టాల్ ను ఏర్పాటు చేసిన మహిళలు ఉప్పొంగిపోయారు. అనంతరం ఇతర స్టాళ్లలోని ఉత్పత్తులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెంట కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మాధవి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు ఉన్నారు.

# మమతా పోలీసు అధికారులతో వచ్చి కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లారని ఈడీ ఆరోపణ



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08,కోల్‌కతాలోని ఐ-ప్యాక్ సంస్థపై దాడుల వ్యవహారంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఈడీ సంచలన ఆరోపణలు చేసింది. ఐ-ప్యాక్ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో దాడులు జరుగుతున్న సమయంలో మమతా బెనర్జీ ఆ ఇంట్లోకి ప్రవేశించి, ఎలక్ట్రానిక్ పరికరాలు, పలు దస్త్రాలు సహా కీలక ఆధారాలను తీసుకువెళ్లారని పేర్కొంది. ముఖ్యమంత్రి, ఆమె సహాయకులు, పోలీసులు వాటిని బలవంతంగా తీసుకెళ్లారని అన్నారు.బొగ్గు అక్రమ రవాణా ద్వారా ఆదాయం పొందిన వ్యక్తులకు సంబంధించి కోల్‌కతాలో ఈ సోదాలు చేపట్టినట్లు ఈడీ వెల్లడించింది. హవాలా మనీతో ఐ-ప్యాక్‌కు సంబంధం ఉందని, ఇందులో ఒక వ్యక్తికి, ఈ సంస్థకు మధ్య కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని తెలిపింది.పెద్ద సంఖ్యలో పోలీసు అధికారులతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఐ-ప్యాక్ డైరెక్టర్ నివాసానికి వచ్చారని తెలిపారు. అప్పటి వరకు సోదాలు శాంతియుతంగా జరిగాయని ఈడీ వెల్లడించింది. సాధారణ ప్రక్రియలో భాగంగానే ఈ సోదాలు నిర్వహించినట్లు తెలిపింది. ఏ రాజకీయ పార్టీని, ఏ ఎన్నికను లక్ష్యంగా చేసుకుని ఈ సోదాలు చేపట్టలేదని స్పష్టం చేసింది.



# అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్

## అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్
## 20 సమస్యలకు తక్షణ పరిష్కారం
## వీఆర్వోను సస్పెండ్ చేసిన కలెక్టర్

క్రైం కౌంటర్ న్యూస్, తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'రెవెన్యూ క్లినిక్' తీసుకొచ్చింది. పీజీఆర్ఎ?అబశ్రీశ్రీసకు అనుబంధంగా ఏర్పాటు చేసింది. జిల్లాలో తొలిసారిగా గురువారం చంద్రగిరి నియోజకవర్గంతో ఈ కార్యక్రమం మొదలైంది. వివిధ భూ సమస్యలపై 752 అర్జీలు అందాయి. ఉదయం 9.30 గంటలకే నియోజకవర్గం నుంచి అర్జీదారులు బారులు తీరారు. దరఖాస్తులకోసం జనం ఎగబడటంతో వీటిని ఇచ్చేందుకు కలెక్టరేట్ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి పీజీఆర్ఎస్ హాల్ వరకు భూసమస్యలపై వచ్చిన అర్జీదారులతో నిండిపోయింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన రెవెన్యూ క్లినిక్ రాత్రి 7.30గంటల వరకు సాగింది. కలెక్టర్ వెంకటేశ్వర్, ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు రోజ్మాండ్, దేవేంద్రరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, కలెక్టరేట్ సిబ్బంది, ఆయా మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు అర్జీలు స్వీకరించారు. ఏ సమస్య ఎపుడు పరిష్కారం అవుతుంతో నిర్దిష్ట సమయం ఇచ్చారు. ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అర్జీదారులతో కలెక్టర్ మాట్లాడారు. వారి సమస్యలను విన్నారు. 20 మంది అర్జీదారులకు తక్షణ పరిష్కారం చూపారు. నియోజకవర్గంలోని 8మంది లబ్ధిదారుల (సుమారు 24ఎకరాలు) భూములను 22ఏ నుంచి తొలగించి అప్పటికప్పుడు వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇంటిస్థలాలు కావాలని తిరుగుతున్న వారికి ఖాళీ లేఅవుట్లలో ఇంటిస్థలాల ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఇన్నేళ్ల సమస్య పరిష్కారం కావడంతో 20మంది లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేశారు. మిగతా వాటినీ ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు.

తప్పుడు నివేదిక ఇచ్చిన వీఆర్వో సస్పెన్షన్

వేరే వారి పేరుతో భూములను రిజిస్టర్ చేసి కట్టబెట్టారంటూ రెవెన్యూ క్లినిక్‌లో రామచంద్రాపురం మండలం పీవీపురానికి లక్ష్మపతి వీఆర్వోపై ఫిర్యాదు చేశారు. అదే సమయంలో సంజీవరాయపురానికి చెందిన శంకర్‌రెడ్డికి అనుభవం లేకున్నా డీకేటీ పట్టా ఇచ్చినట్లు వెల్లడైంది. దీంతో గంగిరెడ్డిపల్లికి చెందిన వీఆర్వో గుణభూషణనాయుడిపై అక్కడికక్కడే కలెక్టర్ విచారించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా తప్పుడు నివేదికలిచ్చిన ఆ వీఆర్వోను అక్కడికక్కడే సస్పెండ్ చేశారు.

సులువుగా పరిష్కారం

జిల్లాలో గత 18 నెలల్లో 38 వేల అర్జీలు అందాయి. వీటిని తక్షణం పరిష్కరించడం గగనంగా మారింది. ఒక్కో నియోజకవర్గానికి ఒకరోజు కేటాయించడంతో రికార్డుల సహా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం చాలా సులువుగా మారింది.

కలెక్టర్ వెంకటేశ్వర్

ఉదయం అర్జీ.. సాయంత్రానికి పరిష్కారం


మా భూమిని 22ఏ నిషేధిత జాబితాలో పెట్టారు. దీనిని తొలగించాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఎన్నో ఏళ్లుగా తిరిగి అలసిపోయాను. రెవెన్యూ క్లినిక్‌లో ఉదయం అర్జీ ఇవ్వగానే.. సాయంత్రానికంతా ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించామంటూ కలెక్టర్ ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్‌తో ఏళ్ల సమస్యను గంటల్లో పరిష్కరించడం ఆనందంగా ఉంది.

– వెంకటసుబ్బారావు, మొగరాల, పాకాల మండలం

ఇది ఊహించలేదు

నిషేధిత జాబితా నుంచి మా భూమిని తొలగించమని ఎన్నో సార్లు అర్జీలిచ్చా. కాలయాపన తప్ప పరిష్కారం లభించలేదు. రెవెన్యూ క్లినిక్‌లో ఉదయం అర్జీ ఇస్తే సాయంత్రం పిలిచి 22ఏనుంచి భూమిని తొలగించామని ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇది నేను ఊహించలేకపోయా.

## కాలుష్య కోరల్లో విశాఖ.. దేశంలో రెండో స్థానం



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08, విశాఖపట్నం నగరం తీవ్ర వాయు కాలుష్యంతో అల్లాడుతోంది. దేశంలో కాలుష్య పరిస్థితి విషమంగా ఉన్న జాబితాలో విశాఖ రెండో స్థానానికి చేరుకుంది. గత కొన్ని రోజులుగా గాలి నాణ్యత సూచీలు 326 దాటుతున్నాయి. రాత్రి సమయాల్లో ఇది 329కి చేరుకుంటోంది. పర్యావరణవేత్తలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై జరిమానాలు, కాలం చెల్లిన వాహనాలపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ చర్యలు ఎంత వరకు ప్రభావవంతంగా ఉంటాయో వేచి చూడాలి.

# జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08, విశాఖ జిల్లా కోర్టుకు గురువారం గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు వచ్చింది. కోర్టు అధికారులు విషయాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చికి తెలియజేయడంతో బాంబ్‌స్క్వాడ్ కోర్టు ఆవరణలో తనిఖీ చేపట్టింది. ఎలాంటి బాంబు లేదని నిర్ధారించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా కోర్టులో బాంబు పెట్టినట్టు గుర్తుతెలియని వ్యక్తులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజుకు ఈమెయిల్ పంపించారు. ఈమెయిల్ పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి దీనిపై సీపీకి లేఖ రాశారు. ప్రధాన న్యాయమూర్తి లేఖపై వెంటనే స్పందించిన సీపీ బాంబు స్క్వాడ్ సిబ్బందితోపాటు టూటౌన్ సీఐ ఎర్రంనాయుడును కోర్టు ప్రాంగణంలో తనిఖీల కోసం పంపించారు. బాంబు స్క్వాడ్ సిబ్బంది మెటల్ డిటెక్టర్లతో కోర్టు ఆవరణలోనూ, హాళ్లలోనూ తనిఖీ చేశారు. పార్కింగ్‌లో ఉన్న వాహనాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ కూడా వచ్చింది. ఎక్కడా బాంబు లేదని తేలడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కోర్టు అధికారులు ఇచ్చిన సమాచారం, ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీపీ తెలిపారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు.సింహాచలం మాజీ ఈఓకు చార్జిమెమో

పది రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం

మాస్టర్‌ప్లాన్‌లో లేని పనులు చేపట్టడమే

చందనోత్సవం రోజున ప్రమాదానికి కారణంగా గుర్తింపుసింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారిగా పనిచేసిన వేంద్ర త్రినాథరావుకు దేవదాయ శాఖ నుంచి చార్జిమెమో జారీ అయింది. దానిపై పది రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఎక్స్ అఫీషియో సెక్రటరీ హరి జవహర్‌లాల్ గురువారం నోటీసు ఇచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న సింహాచలం కొండపై చందనోత్సవం జరిగింది. అక్కడ ఒక గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఆ కమిటీ దేశాల మేరకు పలువురు ఇంజనీర్లను సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదుచేశారు. ఆ సమయంలో ఈఓగా పనిచేసిన త్రినాథరావుపై కూడా విచారణ జరిగింది.

సింహగిరిపై అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' పథకం కింద రూ.52 కోట్లు ఇచ్చింది. వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలనే దానిపై మాస్టర్ ప్లాన్ తయారుచేశారు. అయితే దానికి విరుద్ధంగా కొన్ని పనులు చేపట్టారు. అందులో భాగంగానే జోడుభద్రాల వద్ద గోడ నిర్మించారు. దానికి సరైన పునాదులు లేకపోవడంతో చందనోత్సం రోజు తెల్లవారుజామున కురిసిన వర్షానికి కూలిపోయింది. ఆ గోడ పక్క నుంచే భక్తులకు క్యూలైన్లు పెట్టడంతో ఆ సమయంలో అక్కడున్న వారిలో ఏడుగురు మరణించారు. మాస్టర్‌ప్లాన్‌లో లేని పనులకు అనుమతి ఇవ్వడమే ఈ ప్రమాదానికి కారణమని గుర్తించి ఈఓపై చార్జిమెమో ఇచ్చారు. అందులో పేర్కొన్న అంశాలకు అవునా?, కాదా?...అనే సమాధానాలు పది రోజుల్లో ఇవ్వాలని ఆదేశించారు. ఈలోగా విచారణను ప్రభావితం చేసేలా ఎటువంటి ఒత్తిళ్లు పెట్టినా దానిపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

కోడి మాంసం ధర రికార్డు స్థాయికి చేరింది. శుక్రవారం నాటి మార్కెట్‌లో స్కిన్‌లెస్ కిలో ధర రూ.310, విత్ స్కిన్ రూ.300, లైవ్ (కోడి) రూ.165గా నిర్ణయించారు. ఈ ధర ఇంకా పెరుగుతుందని వ్యాపారులు అంటున్నారు. గత ఏడాది సెప్టెంబరు/అక్టోబరు నెలల్లో పలు ఇబ్బందులు ఎదురుకావడంతో కోళ్ల పెంపకం చేపట్టేందుకు రైతులతో పాటు కార్పొరేట్ కంపెనీలు వెనుకంజ వేశాయి. దాంతో ప్రస్తుతం మార్కెట్ డిమాండ్‌కు తగినన్ని కోళ్లు దొరకడం లేదు. సంక్రాంతి పండుగ నాటికి డిమాండ్‌కు తగినన్ని కోళ్లు లభ్యం కాకపోతే ధరలు మరింత పెరుగుతాయని రిటైలర్లు అంటున్నారు.

# మళ్లీ అదే విషం! అమరావతిపై జగన్ కొత్త కుట్రలు



## లేని రివర్ బేసిన్‌ను 'సృష్టించిన' వైసీపీ నేత
## నదికి 6 కిలోమీటర్ల దూరంలో కోర్ క్యాపిటల్
## ప్రభుత్వ ప్రధాన భవనాలన్నీ అక్కడే
## కరకట్టకు వంద మీటర్ల వరకే 'రివర్ బేసిన్'
## అయినా.. కొత్త వాదన మొదలుపెట్టిన జగన్

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 08, రాజధాని కోసం రెండోదశ భూసమీకరణ ప్రక్రియ ప్రారంభమైన వేళ... 'అమరావతి'కి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులోనే బిల్లు ఆమోదించేలా ప్రయత్నాలు సాగిస్తున్న సమయంలో... వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోసారి అమరావతిపై విషం చిమ్మారు. 'రాజ్యాంగంలో అసలు రాజధాని అనే పదమే లేదు' అని పాతపాట పాడుతూనే... 'నదీ పరీవాహక ప్రాంతం' (రివర్ బేసిన్)లో నిర్మాణాలు చేస్తున్నారని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతిని జాతీయ స్థాయిలో వివాదాస్పదం చేసేందుకు లేని 'రివర్ బేసిన్'ను సృష్టించారు. ప్రస్తుతం రాజధానిలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ భవనాలను నేలపాడు గ్రామ పరిధిలో నిర్మిస్తున్నారు. ఇది కోర్ క్యాపిటల్ ఏరియా! ఈ ప్రాంతం కృష్ణా నదికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. రాజధానిలోని ఈ–5, ఈ–6 రోడ్ల మధ్య ఈ నిర్మాణాలు వస్తున్నాయి. కృష్ణా నదీ ప్రవాహం... ఆ తర్వాత కొంత దూరంలో వరదల సమయంలో ముంపును అడ్డుకునే కరకట్ట... ఆ కరకట్ట నుంచి ఐదారు కిలోమీటర్ల దూరంలో 'కోర్ క్యాపిటల్' వస్తోంది. కృష్ణా నదికి, నేలపాడుకు మధ్య ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, లింగాయపాలెం తదితర గ్రామాలు ఉన్నాయి.జగన్ వాదన ప్రకారం ఈ గ్రామాలన్నీ తరలించాల్సిందే. అక్కడ ఇళ్లూ వాకిళ్లూ ఉండకూడదు. వాటన్నింటినీ ఖాళీ చేయించాల్సిందే! అసలు విషయం ఏమిటంటే... రాజధాని గ్రామాలేవీ 'రివర్ బేసిన్' పరిధిలోకి రావు. కరకట్ట నుంచి వంద మీటర్ల వరకు మాత్రమే రివర్ బేసిన్‌గా పరిగణిస్తున్నట్లు సాగునీటి శాఖ అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ... 'రాజధానిని రివర్ బేసిన్‌లో నిర్మిస్తున్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి' అని జగన్ డిమాండ్ చేయడం విశేషం. ఇది అమరావతిపై విషం చిమ్మడం తప్ప మరొకటి కాదని రాజధాని గ్రామ రైతులు మండిపడుతున్నారు.

మరి మీ ప్యాలెస్ మాటేమిటి?

'జగన్ తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నారు. మేం అధికారంలోకొస్తే అమరావతి ఇక్కడే ఉంటుంది' అని 2019 ఎన్నికల ముందు వైసీపీ నేతలు మభ్యపెట్టారు. ఆ సంగతి పక్కనపెడితే... తాడేపల్లిలో జగన్ ప్యాలెస్ కృష్ణా నదికి కేవలం 2 కిలోమీటర్ల లోపే ఉంటుంది. జగన్ చెప్పిన లెక్క ప్రకారం ఇదీ 'రివర్ బేసిన్'లో ఉన్నట్లే. మరి ఆయన తన ప్యాలె?అబశ్రీశ్రీసను ఖాళీ చేసేస్తారా?

'ఆంగ్ల' మర్మమేమిటో!?

జగన్ బుధవారం తాడేపల్లి ప్యాలె?అబశ్రీశ్రీసలోపల ఎంపిక చేసుకున్న మీడియాతో మాట్లాడారు. అంతా తెలుగులోనే! అది ముగిశాక... ఎన్నడూలేని విధంగా బయటకు వచ్చి కొన్ని జాతీయ మీడి యా చానళ్లతో మరోసారి మాట్లాడారు. లోపల తెలుగులో మాట్లాడిన జగన్... తన సందేశం ఎవరికో చేరాలన్న ఉద్దేశంతో కాబోలు బయట మీడియాతో ఆంగ్లంలో మాట్లాడారు. జాతీయ మీడియా ప్రతినిధులను పిలిపించుకోవడం, అమరావతి గురించి ప్రస్తావించేలా చూడటం, అంతా వ్యూహం ప్రకారమే జరిగినట్లు తెలుస్తోంది. దీని మర్మమేమిటి? ఎవరి కోసం 'ఆంగ్లంలో' సంకేతాలు పంపారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# అటు నిరంతరం..ఇటు అవాంతరం

క్రైం కౌంటర్ న్యూస్, గరుగుబిల్లి, జనవరి 8: తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని ఎడమ కాలువ ద్వారా పుష్కలంగా సాగునీరు అందుతుంటే, కుడి కాలువలో మాత్రం సాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఎడమ కాలువ పరిధిలోని ప్రధాన షట్టరు మొరాయించడంతో అది కిందకు దిగడం లేదు. దీంతో సాగునీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడడం లేదు. ఖరీఫ్ సీజన్ నుంచి నేటి వరకు కూడా ఈ కాలువ ద్వారా సాగునీరు నిరంతరం ప్రవహిస్తోంది. కుడి కాలువ విషయానికి వస్తే దీనిపై ఉన్న ప్రధాన షట్టరు దెబ్బతినడంతో అది పూర్తిగా కిందకు జారిపోయింది. దీంతో నీటి సరఫరా ఒక్కసారిగా నిలిచిపోయింది. షట్టరును పైకి లేపేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. ఫలితంగా రబీలో రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..


ఎడమ, కుడి కాలువల పరిధిలోని ప్రధాన షట్టర్లు నిత్యం మొరాయిస్తున్నాయి. గత కొంత కాలంగా వాటిని బాగు చేయడం లేదు. ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి సుమారు 36 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుంది. అయితే ప్రధాన షట్టరు కిందకు దిగకపోవడంతో గత మూడు నెలలుగా కాలువ నుంచి సాగునీరు సరఫరా అవుతుంది. ఖరీఫ్‌లో ఏ మాదిరిగా నీరు వచ్చేదో ఇప్పుడు రబీలో కూడా అదే విధంగా ప్రవహిస్తోంది. నిత్యం సాగునీరు సరఫరా అవుతుండడంతో వీరఘట్టం, గరుగుబిల్లి, పాలకొండ ప్రాంతాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లోకి నిత్యం నీరు వచ్చి చేరుతుండడంతో పంటల నిర్వహణకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. అవసరం ఉన్న సమయంలో సాగునీరు అందదు.. లేని సమయంలో పుష్కలంగా అందుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తోటపల్లి కుడి కాలువలో నిలిచిన సాగునీటి సరఫరా

– కుడి కాలువకు సంబంధించి సుమారు 9 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా కావాల్సి ఉంది. ఇటీవల వరకూ ప్రధాన షట్టరు బాగా పనిచేసేది. నీరు అవసరం అయినప్పుడు షట్టర్‌ను అధికారులు పైకి ఎత్తేవారు. అవసరం లేకుంటే షట్టర్‌ను కిందకు దించేవారు. అయితే, ప్రస్తుతం షట్టర్ గేర్‌రాడ్డు అరిగిపోవడంతో అది ఒక్కసారిగా కిందకు జారింది. దీంతో గరుగుబిల్లి మండలం సుంకి నుంచి వంగర మండలం కొత్తవలస వరకు సాగునీరు సరఫరా కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షట్టర్‌ను పైకి ఎత్తేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. పాత రెగ్యులేటర్ పరిధిలోని రెండు కాలువల అభివృద్ధిపై అధికార యంత్రాంగం దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కాలువల పరిధిలో గుర్రపు డెక్క తొలగింపుతో పాటు గండ్లు పూడ్చడం వంటి పనులను ఆయా ప్రాంతాలకు చెందిన రైతులే స్వచ్ఛందంగా నిర్వహించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం..

పాత రెగ్యులేటర్ పరిధిలోని రెండు కాలువల ప్రధాన షట్టర్ల మరమ్మతులకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. పనుల నిర్వహణకు టెండర్లను పిలిచాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూస్తాం.



# సినిమా



## తెలుగు బ్రాహ్మీన్ అయిన ఇంద్రజ.

నటి ఇంద్రజ గతంలో ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన ఇంటర్ ఫెయిత్ మ్యారేజ్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివరాలను పంచుకున్నారు. తాను ఒక తెలుగు బ్రాహ్మిణ్‌నని, ముస్లిం అయిన తన భర్తను పెళ్లి చేసుకోవడానికి గల కారణం గురించి అడిగిన ప్రశ్నకు, మనసు చూసి మాత్రం ఇది జరిగిందని.. ఒకరినొకరు ఇష్టపడ్డాక.. అర్థం చేసుకున్నాక పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు. మతం చూసి, కులం చూసి పెళ్లి చేసుకోవడం జరగదని, తమ వేవ్‌లెంగ్త్ సరిపోవడంతోనే తాము పెళ్లి చేసుకున్నామని ఇంద్రజ స్పష్టం చేశారు. ఇంద్రజ, ఆమె భర్త ఆరు సంవత్సరాల పాటు స్నేహితులుగా ఉన్నారని తెలిపారు. కేవలం పరిచయం అయిన వెంటనే వివాహం చేసుకోలేదని, ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే, జీవితంలో ఒకరికొకరు పూర్తి సపోర్ట్ సిస్టమ్‌గా ఉండగలరని నమ్మకం కుదిరిన తర్వాతే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నామని ఆమె వివరించారు. ఇది ఇద్దరిలోనూ కలిగిందని, అలా ఒక రోజు చెన్నైలో వివాహం చేసుకున్నారని ఇంద్రజ చెప్పారు.ఇంద్రజ భర్త వృత్తిపరంగా రచయిత. యాడ్ ఫిల్మ్‌మేకర్‌గా పనిచేస్తారు. ఆయన యాడ్ ఫిల్మ్, సీరియల్స్‌లో నటించారు కూడా. ఇవి మాత్రమే కాకుండా వారికి కుటుంబ వ్యాపారం కూడా ఉంది. ఇంద్రజ వాళ్ల మామగారిది గవర్నమెంట్ ఎక్స్‌పోర్ట్స్ వ్యాపారం. సౌత్ ఈస్ట్ ఏషియన్ కంట్రీస్‌కు కార్గో సప్లై చేస్తుంటారు. తన సినిమాల ఎంపిక విషయంలో తన భర్త పాత్ర గురించి మాట్లాడుతూ, ఆయన మంచి రచయిత అని, ఏదైనా కథ ఉంటే చెబుతారని వెల్లడించారు. తాను చేసే సినిమాలు, పాత్రల గురించి అడిగితే ఆయన తన అభిప్రాయాన్ని తెలియజేస్తారని, "ఇది బాగుంటుందా, ఇది సూట్ అవుతుందా" అని అడిగితే మాత్రమే సలహా ఇస్తారని ఇంద్రజ పేర్కొన్నారు. కానీ "ఇది చెయ్యి, ఇది చేయకూడదు" అని మాత్రం ఎప్పుడూ చెప్పరని, తన పనిలో ఆయన అంతవరకు జోక్యం చేసుకోరని నటి ఇంద్రజ వివరించారు. వారి బంధం పరస్పర గౌరవం, మద్దతుపై ఆధారపడి ఉందని ఆమె మాటల్లో స్పష్టమైంది.





## ఈ సూపర్ ఫుడ్స్ తీసుకుంటే మీ కిడ్నీలకు ఢోకా ఉండదు!

మూత్రపిండాలు మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాలు. అవి రక్తాన్ని శుద్ధి చేసి, శరీరంలోని ద్రవ సమతుల్యతను కాపాడుతాయి. మిశ్రమ విషాలను తొలగిస్తాయి. కానీ, మూత్రపిండాలు సరిగ్గా పని చేయకపోతే.. విషపదార్థాలు శరీరంలో ఎక్కువ కాలం మిగులుతాయి, ఇది ఆరోగ్యానికి ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాకు ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 674 మిలియన్ల మంది దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్నారు.

అయితే, ఎక్కువగా చింతించాల్సిన అవసరం లేదు. కొన్ని సహజ ఆహార పదార్థాలు ప్రతిరోజూ తీసుకోవడం ద్వారా మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచవచ్చు. ఇవి వెంటనే డీటాక్సిఫికేషన్ చేయవు, కానీ నిత్యం తీసుకుంటే మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి.

వెల్లుల్లి వెల్లుల్లి ప్రత్యక్షంగా మూత్రపిండాలకు ఉపయోగపడకపోయినా పరోక్షంగా లాభదాయకంగా ఉంటుంది. ఇది శరీరంలో వాపును తగ్గిస్తుంది, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం తగ్గించడంలో కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుంది. పచ్చి లేదా తేలికగా కాల్చిన వెల్లుల్లిని ఉపయోగించడం ఉత్తమం.

ఆపిల్స్ ఆపిల్‌లోని ఫైబర్ పేగుల ద్వారా వ్యర్థాలను తొలగించి మూత్రపిండాలపై భారాన్ని తగ్గిస్తుంది. వీటిలోని పోషకాలు రక్తంలో చక్కెరను నియంత్రించడంలో, మూత్రపిండాల చిన్న రక్తనాళాలను రక్షించడంలో సహాయపడతాయి. ఆపిల్ తొక్కతో తినడం ద్వారా అదనపు ప్రయోజనాలు లభిస్తాయి.

కొత్తిమీర శరీరం నుంచి అదనపు సోడియాన్ని తొలగించి మూత్ర ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. దీని వల్ల శరీరంలో ద్రవ సమతుల్యత కాపాడబడుతుంది, మూత్రపిండాల పనితీరు సులభమవుతుంది. విత్తనాలను రాత్రిపూట నానబెట్టి ఉదయం నీటితో త్రాగడం కూడా సహజమైన డీటాక్సిఫికేషన్ విధానం.

కాలీఫ్లవర్ పొటాషియం తక్కువగా ఉండటం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి తక్కువ అవుతుంది. అదే సమయంలో ఫైబర్, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వల్ల మూత్రపిండాలు, కాలేయానికి మద్దతుగా పనిచేస్తాయి. సోరకాయ కూడా కిడ్నీల ఆరోగ్యానికి ఎంత అవసరమైన పోషకాలను అందిస్తుంది.

అందుకే, ప్రతిరోజూ ఈ సహజ ఆహారాలను ఆహారంలో చేర్చడం ద్వారా, మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచి, శరీరంలో విషపదార్థాల సమతుల్యతను కాపాడవచ్చు.



## ఇంట్లోనే ఉంటుందని లైట్ తీసుకుంటారు..

మునగలో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మునగ మొక్క, వేర్లు, మునక్కాయలు, ఆకులు, పువ్వులు అన్నీ పవర్‌ఫులే.. అందుకే.. వీటిని రెగ్యులర్ గా తీసుకుంటే.. ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా దాదాపు అన్ని సీజన్లలో లభించే.. మునగలో ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి.. మునగకాయ, మునగ ఆకులు.. దేనికదే ప్రసిద్ధి.. వీటిని సూప్ గా లేదా.. కూరగా, పప్పులో వేసుకుని తినవచ్చు.. ఇంకా జ్యూస్ గా కూడా తాగొచ్చు.. మునగాకులను ఆయుర్వేదం ప్రకారం.. తీసుకుంటే.. ఎన్నో సమస్యలను దూరం చేయొచ్చంటున్నారు నిపుణులు.. మునగ మొక్క దాని వేర్ల నుండి పువ్వుల వరకు ఔషధ గుణాలతో నిండిన మొక్క అని.. ఇది అనేక వ్యాధులను సులభంగా నయం చేయగలదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

మునగలో ఎన్నో పోషకాలు..

అయితే.. మునగ ఆకులను పోషకాల పవర్‌హౌస్ గాపిలుస్తారు. కేవలం 100 గ్రాముల మునగాకులలో నారింజ కంటే ఏడు రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఈ ఆకు ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో ఇది చూపిస్తుంది. మునగాకులలో మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్లు ఖ, జు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఈ ఆకులలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.. కేలరీలు ఉండవని పేర్కొంటున్నారు.

మునగ ప్రయోజనాలు..

టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతుంటే మునగ మొక్క వేర్లను నీటిలో మరిగించి తాగితే ఫలితాలు కనిపిస్తాయి.

తీవ్రమైన తలనొప్పి ఉంటే మునగాకులను బాగా నలిపి తలకు పట్టిస్తే తలనొప్పి క్రమంగా తగ్గిపోతుంది.

మునగ మొక్క వేరు ఆరోగ్యానికి చాలా మంచిది.. మీకు గొంతు నొప్పి ఉంటే, మీరు దాని వేళ్ళతో కషాయం తయారు చేసి, నొప్పి నుండి ఉపశమనం పొందడానికి పుక్కిలించవచ్చు. మీరు దాని ఆకులను నమలడం ద్వారా మీ చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చు. మీరు శారీరక బలహీనతతో బాధపడుతుంటే, ఈ మునగ మొక్క పువ్వులను నీటిలో మరిగించి త్రాగవచ్చు. ఇది ఆర్థరైటిస్ నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇది మాత్రమే కాదు, ఈ మునగాకు శరీరం లోపల కాలేయం ఆరోగ్యాన్ని కాపాడుతుందని పేర్కొంటున్నారు.

## 7 వికెట్లు పడినా..

విజయ్ హజారే ట్రోఫీలో ఊహించని అద్భుతం జరిగింది. అసలు గెలుస్తుందన్న ఆశలే లేని స్థితి నుంచి ఒక బౌలర్ బ్యాట్ పట్టి వీరవిహారం చేస్తే ఎలా ఉంటుందో జమ్మూ కాశ్మీర్ ఆటగాడు ఆకిబ్ నబీ చూపించాడు. రాజ్‌కోట్ వేదికగా హైదరాబాద్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆకిబ్ నబీ అసాధ్యమైన విజయాన్ని సుసాధ్యం చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 50 ఓవర్లలో 268 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. జమ్మూ కాశ్మీర్ బౌలర్ ఆకిబ్ నబీ బౌలింగ్‌లోనూ మెరిశాడు. 10 ఓవర్లలో 56 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టి హైదరాబాద్‌ను కట్టడి చేశాడు. అయితే అసలైన మ్యాజిక్ ఇన్నింగ్స్ రెండో భాగంలో మొదలైంది. లక్ష్య చేధనలో జమ్మూ కాశ్మీర్ ఘోరంగా విఫలమైంది. కేవలం 90 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. హైదరాబాద్ విజయం ఖాయమనుకున్న తరుణంలో ఆకిబ్ నబీ బ్యాట్‌తో సునామీ సృష్టించాడు.

ఎనిమిదో నంబర్ బ్యాటర్‌గా వచ్చిన ఆకిబ్ నబీ.. బౌలర్ లా కాకుండా టాప్ ఆర్డర్ బ్యాటర్ లా రెచ్చిపోయాడు. కేవలం 82 బంతుల్లోనే 114 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇతని ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 7 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఆకిబ్ కు 9వ నంబర్ బ్యాటర్ వంశజ్ శర్మ (69 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి వికెట్ పడకుండా జాగ్రత్త పడుతూనే స్కోరు బోర్డును పరిగెత్తించారు. దీంతో 47.5 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి జమ్మూ కాశ్మీర్ లక్ష్యాన్ని చేరుకుంది.

ఆకిబ్ నబీకి ఇది లిస్ట్-ఏ కెరీర్‌లో తొలి సెంచరీ. గత 35 మ్యాచ్‌ల్లో కనీసం ఒక్క అర్థ సెంచరీ కూడా లేని ఈ ఆటగాడు, ఏకంగా సెంచరీతో జట్టును గెలిపించడం విశేషం. ఈ అద్భుత ప్రదర్శన ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు పెద్ద బూస్ట్ అని చెప్పాలి. ఇటీవల జరిగిన మెగా వేలంలో ఢిల్లీ టీమ్ ఇతనిని 8.4 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. తాను కేవలం బౌలర్ మాత్రమే కాదు, అవసరమైతే మ్యాచ్ ఫినిష్ చేయగల ఆల్ రౌండర్ అని ఆకిబ్ నేటి ఆటతో నిరూపించుకున్నాడు.



## హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ భార్య రేంజే వేరు.

టీమిండియా స్టార్ క్రికెటర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ సతీమణి రితికా సజ్దే వార్తల్లో నిలిచారు. ముంబైలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఆమె ఒక విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశారు. దీని ధర వింటే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. రోహిత్ శర్మ ఐపీఎల్ జీతం కంటే కూడా ఈ ఇంటి ధర చాలా ఎక్కువగా ఉండటం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

ముంబైలోని ప్రభాదేవి ప్రాంతంలో ఉన్న అత్యంత విలాసవంతమైన అహూజా టవర్స్?లో రితికా సజ్దే ఈ కొత్త అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశారు. దీని మొత్తం ధర రూ.26.30 కోట్లు. కేవలం ఈ ఇంటి రిజిస్ట్రేషన్ కోసమే ఆమె భారీగా ఖర్చు చేశారు. డిసెంబర్ 12, 2025న జరిగిన ఈ లావాదేవీలో రూ.1.31 కోట్ల స్టాంప్ డ్యూటీ, రూ.30,000 రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించినట్లు సమాచారం. ఇది ఒక రెసిడెన్షియల్ బిల్డింగ్ అయినప్పటికీ, అక్కడ ఉండే సౌకర్యాలు మాత్రం ఫైవ్ స్టార్ హోటల్ రేంజ్‌లో ఉంటాయి.

రితికా కొన్న ఈ అపార్ట్‌మెంట్ వైశాల్యం సుమారు 2,760.40 చదరపు అడుగులు. ముంబై లాంటి నగరంలో ఇంత పెద్ద ఫ్లాట్ దొరకడం విశేషం. దీనితో పాటు మూడు కార్లను పార్క్ చేసుకునేందుకు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. ఈ ఆస్తిని ఆమె అజింక్య డివై పాటిల్, పూజా అజింక్య పాటిల్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ప్రభాదేవి ప్రాంతం ముంబైలోని బిజినెస్ హబ్‌లకు, బాంద్రా-వర్లీ సీ లింక్‌కు అతి సమీపంలో ఉండటం వల్ల ఇక్కడ స్థిరాస్తి ధరలు ఆకాశాన్ని తాకుతుంటాయి.ఈ ఇంటి ధరను రోహిత్ శర్మ ఐపీఎల్ జీతంతో పోలుస్తూ నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్‌లో రోహిత్ శర్మ జీతం ఏడాదికి రూ.16 కోట్లు. కానీ రితికా కొన్న అపార్ట్‌మెంట్ ధర అంతకంటే మరో రూ.10 కోట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. రితికా కేవలం రోహిత్ భార్యగానే కాకుండా, స్పోర్ట్స్ మేనేజర్‌గా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గతంలో ఆమె కార్నర్‌స్టోన్ స్పోర్ట్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలో పని చేస్తూ పలువురు అగ్రశ్రేణి అథ్లెట్ల బ్రాండ్ ఎండార్స్‌మెంట్లను పర్యవేక్షించేవారు.

రితికా కొత్త ఇల్లు ఉన్న ప్రభాదేవి ఏరియా వెస్ట్రన్ ఎక్స్‌ప్రెస్ హైవే, సేనాపతి బాపట్ మార్గ్ వంటి ప్రధాన రహదారులకు అనుసంధానించబడి ఉంటుంది. ఇక్కడ నివసించే వారు సెలబ్రిటీలు, బడా పారిశ్రామికవేత్తలే ఉంటారు. రోహిత్ శర్మ, రితికా ఇప్పటికే ముంబైలో ఒక అద్భుతమైన నివాసంలో ఉంటున్నారు.. ఇప్పుడు ఈ కొత్త అపార్ట్‌మెంట్‌ను పెట్టుబడి కోసమా లేక నివాసం కోసమా కొనుగోలు చేశారనేది తెలియాల్సి ఉంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com